Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# 'క్రెడిట్' భారమైన నష్టమే!




**షాపింగ్ అంటే, డిబెట్, క్రెడిట్‌కార్డుల హవా నడుస్తోంది. దుస్తులు కొనే దగ్గర్నుంచి... పచారీ సామగ్రి వరకూ అంతా క్రెడిట్ కార్డులు, డిబెట్ కార్డులతోనే. ఇలాంటప్పుడే వాటి బిల్లుల చెల్లింపుల విషయంలో ముందస్తు అవగాహన ఉండాలి. లేదంటే చిక్కుల్లో పడతాం!**

డబ్బు గురించి ఆలోచించకుండా ఖర్చు చేసేసి తర్వాత చిక్కుల్లో పడేవారు ఎందరో. ముఖ్యంగా క్రెడిట్ కార్డుల వినియోగం అలవాటైన నేటి రోజుల్లో ఇది సర్వసాధారణం. రానున్న రోజుల్లో వచ్చే ఆదాయానికి ఇప్పుడే ఖర్చు చేసేసి. ఆ తర్వాత ఆందోళన చెందుతుంటారు. వాడేసిన భారీ బిల్లులను ఎలా చెల్లించాలో బెంబేలెత్తిపోతారు. చిన్న సమస్యలను తీవ్రతరం చేసుకుంటున్న వారి సంఖ్యా తక్కువేమీ లేదు. ఒక కార్డు బిల్లు చెల్లించేందుకు మరో కార్డు అందించే 'బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్' వెసులుబాటును ఉపయోగించుకుంటున్నారు. చివరకు రుణ వలయం లో చిక్కుకుంటున్నారు. ఒకసారంటూ బకాయిలు వాయిదా వేసుకుం టూ వెళితే ఆర్థికంగా చిక్కుల్లో చిక్కుకోవడానికి ఎంతో కాలం పట్టదు.

### బిల్లులు.. వడ్డీలు

క్రెడిట్ కార్డు బిల్లులను వడ్డీ లేకుండా 30 నుంచి 50 రోజుల వ్యవధిలో తీర్చేయవచ్చు. పండగ సందర్భంగా బోనస్ వస్తుందనో. మరేదో మార్గంలో సొమ్ము వస్తుందనో పెద్ద మొత్తంలో కార్డు ద్వారా ఎక్కువ శాతం మంది కొనుగోలు చేస్తుంటారు. ఈ అంచనాలు నిజం కాకపోతే బిల్లులో 5 నుంచి 10 శాతం కనీస మొత్తం చెల్లించి. తాత్కాలికంగా గండం గట్టెక్కిందనుకుంటారు. మున్ముందు గండాలకు ఇదే ఆరంభం కావచ్చని ఊహించరు. కనీస మొత్తం చెల్లించిన తర్వాత మిగిలిన బిల్లుపై 24 నుంచి 50 శాతం వరకూ వడ్డీ పడుతుంది. అప్పటి నుంచి కార్డు ద్వారా కొన్న ప్రతి రూపాయిపైనా వడ్డీ లెక్కవేస్తారు. ఇలా కొన్నాళ్లు పోతే కనీస మొత్తమూ ఎంతో భారంగా కనిపిస్తుంది. క్రమం తప్పకుండా వేతనం పొందే ఉద్యోగులకయితే ఫర్వాలేదు. వ్యాపారం. వృత్తి ద్వారా ఉపాధి పొందుతున్న వారి రాబడిలో నిలకడ ఉండదు.

### నిబంధనలపై ఆరా!

కనీస మొత్తం కూడా కట్టకపోతే బిల్లు చెల్లించాల్సిన తేదీ దాటిన వెంటనే బకాయిదారుల జాబితాలో చేరుస్తారు. బిల్లు వ్యవధి అయిపోయిందని. ఫలానా తేదీలోగా బిల్లు కట్టకపోతే కార్డును స్తంభింపజేస్తామని సంక్షిప్త సందేశాలు. ఈమెయిళ్లు. ఫోన్‌కాల్స్‌తో విసిగించేస్తారు. ఆ తర్వాత కూడా స్పందించకపోతే కార్డును స్తంభింపజేయడం. మిమ్మల్ని ఎగవేత దారునిగా చేర్చి. మీ పేరును సిబిల్‌లాంటి క్రెడిట్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరోలకు పంపడం చకచకా జరిగిపోతాయి.



### ఇలా చేయాలి!

అనుకోని ఇబ్బందుల వల్ల తాత్కాలికంగా కనీస మొత్తం కూడా చెల్లించలేకపోతే బ్యాంకుకు ఆ విషయం చెప్పేందుకు ఆలస్యం చేయకండి. అప్పటివరకూ ప్రతి బిల్లును సక్రమంగా చెల్లించి ఉంటే.. వ్యవధిని పెంచడానికి బ్యాంకులు అంగీకరించవచ్చు. కార్డు పరిమితి. బకాయిల మొత్తం. ఇదివరలో చెల్లింపుల తీరుతెన్నులు తదితర వివరాల ఆధారంగా బ్యాంకులు కాస్తంత వెసులుబాటు ఇచ్చే అవకాశం ఉంది. ఏది ఏమైనా క్రెడిట్ కార్డ్స్ వినియోగించే విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సిందే. ముఖ్యంగా సకాలంలో చెల్లింపులు జరగాలి. లేదంటే ఆర్థికబారం. ఇబ్బందులు తప్పవు. వీలైనంత వరకు.. అప్పు లేకుండా అంటే క్రెడిట్‌లో కాకుండా క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలోనే షాపింగ్ చేయడమే అన్నివిధాలా శ్రేయస్కరం.